నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

వికలాంగుల పింఛన్ ఇప్పించండి సారు

- కలెక్టరేట్‌కు తల్లితో వచ్చిన బాలుడు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన దాసరి విశాల్ అనే 8 సంవత్సరాల బాలుడు తనకు వికాలంగ పెన్షన్ ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశాడు. లిఫ్ట్ ప్రమాదంలో తన ఎడమ చేతి వేళ్ళు పోయాయని సదరం సర్టిఫికెట్ వచ్చి మూడు నెలలు అవుతున్న తనకు వికలాంగ పింఛన్ రావడంలేదని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



వినతిపత్రం చూపుతున్న బాలుడు

ఎస్టీ మహిళలను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెడుతూ తక్కువ ఎక్కువ కులాలు అనుకుంటూ మహిళలను బూతు మాటలు తిడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేయాలని సోమవారం బస్సాపూర్ గ్రామంలోని పలువురు మహిళలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇలానే దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పలువురు గ్రామస్తులు

అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయొద్దు

- ఐసీడీఎస్ వ్యవస్థను దెబ్బతీసే పీఎం శ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను రద్దు చేయాలి
- నూతన విద్యావిధానం తక్షణమే ఉపసంహరించుకోవాలి
- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రెండు రోజుల సమ్మె
- తొలిరోజు ఇరు జిల్లాల్లో పెద్దఎత్తున ధర్నా
- వేతనాలు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లించి, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

'మాత, శిశు సంరక్షణలో, పౌష్టికాహారం అందజేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం తెరలేపింది. అంగన్‌వాడీల వ్యవస్థను దెబ్బతీసేలా ఉన్న పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను వెంటనే రద్దు చేయాలని' అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇరు జిల్లాలో రెండు రోజుల పాటు అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టారు. తొలిరోజు సోమవారం నిజామాబాద్‌లో ధర్నా చౌక్‌లో, కామారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చౌక్‌లో అంగన్‌వాడీలు పెద్దఎత్తున పాల్గొని ధర్నా చేపట్టారు.

నిజామాబాద్ ధర్నాచౌక్‌లో

కంఠేశ్వర్ : 48 గంటల సమ్మెలో భాగంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్ద ఎత్తున కదిలి ధర్నాచౌక్‌లో తమ సమస్యల పరిష్కారం కోసం నినాదించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జై శంకర్ గౌడ్, నూర్జహాన్ మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి గ్రాడ్యుటీ, పెన్షన్ ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ దాన్ని అమలు జరపటంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని అన్నారు. పైగా కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థలో కూడా జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టడం మూలంగా అంగన్వాడీల ఉద్యోగ భద్రతకే ముప్పు వాటిల్లుతుందని అని అన్నారు. గత ఎన్నికల కన్నా ముందు 24 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సమ్మె సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీ ఉద్యోగులకు 18 వేల వేతనం చెల్లిస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని, గ్రాట్యూటీ పెన్షన్ సదుపాయాన్ని అమలు జరుపుతామని హామీ ఇచ్చి 15 నెలలు అవుతున్నప్పటికీ సమస్యలు పరిష్కరించకపోగా రిటైర్ అయిన వారికి ఇంతవరకు అంగీకరించిన గ్రాడ్యూటీ చెల్లించటం లేదని బడ్జెట్ సమావేశాల్లో అంగన్వాడీలకు బడ్జెట్ పెంచాలని వారు డిమాండ్ చేశారు.

ఈ పోరాటానికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరగడంతో పాటు పని భారం పెరిగిందని, దానికి తగిన విధంగా వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం గతంలో పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ చేపట్టిన పోరాటం న్యాయమయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నన్నేసాబ్, నాగన్న ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి శిర్ప లింగం, నగర నాయకులు రాములు, అంగన్వాడీ జిల్లా నాయకులు స్వర్ణ, దేవగంగు, చంద్రకళ, మంగాదేవి, శివరాజవ్వ, వాణి, జ్యోతి, జగదాంబ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం వద్ద గల ధర్నా చౌక్‌లో రెండు రోజుల ధర్నాను సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సురేశ్‌గొండ, జిల్లా అధ్యక్షురాలు కల్పన మాట్లాడారు. దేశంతో పాటు రాష్ట్రంలో ఐసిడిఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు అవుతుందని, ఈ కాలంలో ఐసిడిఎస్ సేవలు మన్ననలు పొందినట్టు గుర్తుచేశారు. ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేయాల్సి పోయి.. దానిని నిర్వీర్యం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రభుత్వాలు విరమించుకోవాలని అన్నారు. అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలతో పాటు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు నష్టం కలిగించే ఐసిడిఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాలు అనేకం చేసిందని, ఇలాంటి పరిస్థితుల్లో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ వ్యతిరేక విధానాలను అమలు చేయాలని చూడటం అన్యాయం అన్నారు. ఐసీడీఎస్ అంగన్వాడీ కేంద్రాలకు పోటీగా 3 - 6 సంవత్సరాల పిల్లలతో పిఎం శ్రీ పథకం కింద ఫ్రీ ప్రైమరీ (ఎలిమెంటరీ) కేంద్రాలను 28 జిల్లాలలో 56 కేంద్రాలను ప్రారంభించాలనీ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం చేసిందన్నారు. ఈ నిర్ణయం ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే చర్యలు తప్ప మరొకటి కాదన్నారు.

తమ ప్రధాన డిమాండ్‌లు అయిన ప్రతినెలా వేతనం ఒకటవ తేదీన చెల్లించాలని, ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఆ నిధులను ఐసిడిఎస్‌కు కేటాయించాలని, మొబైల్ అంగన్వాడీ సెంటర్స్‌ను రద్దుచేసి, ఐసిడిఎస్ సేవలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన 18,000 వెల వేతనం పెంచాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. మినీ నుండి మెయిన్ అయిన 4000 మంది అంగన్వాడీ టీచర్లకు 10 నెలల బకాయిలు వెంటనే వేతనాలను వెంటనే చెల్లించాలని, హెల్పర్లను నియమించాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్, టీచర్లకు రెండు లక్షలు పెన్షన్ విఆర్ఏ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీఓ వెంటనే జారీ చేయాలన్నారు. 24 రోజుల సమ్మె కాలం వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. వీరి ఆందోళనకు మున్సిపల్ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు రాజనర్సు ధర్నాకు మద్దతు తెలిపారు.



నిజామాబాద్‌లో ధర్నాచౌక్ వద్ద ధర్నా చేపట్టిన అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు



కామారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

మద్దతు తెలిపిన ఐసీడీఎస్ పీడీ



కామారెడ్డిలో అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ రెండు రోజుల ధర్నాకు ఐసిడిఎస్ పీడీ ప్రమీల, దోమకొండ సీడీపీవో రోశిష్మతో పాటు పలువురు సీడీపీవోలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబాయ్, బి లక్ష్మి, సునంద, సునీత, దేవ కర్ణ, ఆర్ అనసూయ, సురేఖ, కే యాదమ్మ విజయ, ఇందిరా, లలిత, విజయ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

రైస్‌మిల్లర్ల నష్టాలను ఊహించుకొని రైతుల మీద ముందే రుద్దితే ఎలా..?

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్
- ఈసారి కొనుగోళ్లను పకడ్బందీగా పరిశీలిస్తామని వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి

రైస్ మిల్లర్ల నష్టాలను ఊహించుకొని ఆ నష్టాలను రైతుల మీద ముందే రుద్దితే ఎట్లా అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, రైతులను మోసం చేయకుండా చూడాలని కోరుతూ సోమవారం జిల్లా పౌరసరఫరాల డీఎస్ఓని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మరో 20 రోజుల్లో వరి పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయనీ, ఆరుగాలం కష్టం చేసి పండించిన పంట వడగళ్ల వాన, ప్రకతి వైపరీత్యాలకు భయపడి తొందరగా పంటలు కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి అమ్ముకోవాలని రైతులు తాపత్రయ పడుతుంటారని అన్నారు. రైతుల భయాన్ని రైస్ మిల్లర్లు, సొసైటీ అధికారులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. క్వింటాలుకు 6 నుంచి 7 కిలోల వరకు తరుగు పేరుతో దండుకుంటున్నారని అన్నారు.

రైస్ మిల్లర్‌లో ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ చేసేందుకు కేంద్రం అనుమతి ఇవ్వదనీ దీంతో తాము రెండు మూడు కిలోలు లాస్ అవుతామని ముందే రైస్ మిల్లర్లు గమనించి రైతు మీదనే ఆ నష్టం భారం వేస్తూ ఉన్నారన్నారు. అందుకనే రైతులు ఆలోచించి తూకం వేయాలని సూచించారు. ఇదే తతంగం ఈ సీజన్లో గనుక జరిగితే తప్పకుండా ప్రశ్నిస్తామని, కావాలంటే రైతు సంఘాలను ఏకం చేసి ఎంత దాకైనా పోరాడతామని అన్నారు. రైతులకు నష్టాలు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘంతో పాటు రైతు సంఘాల ప్రతినిధులు ప్రకాష్, వసంత్‌లు పాల్గొన్నారు.

అసంఘటితరంగ కార్మికుల హక్కుల సాధన సీఐటీయూతో సాధ్యం

- సీఐటీయూలో చేరిన 250 మంది బార్దాన్ కార్మికులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పోరాటానికి తమ హక్కుల సాధనకు అసంఘటిత కార్మికులైన వార్ధాన్ కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని వారి హక్కుల కోసం పోరాడుతదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 250 మంది బార్దాన్ కార్మికులు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో యూనియన్‌లో సోమవారం చేరారు.



వివరాలు మెయిన్‌లో..

ప్రజావాణి వినతులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్‌ల సూచన
- నిజామాబాద్‌లో 64, కామారెడ్డిలో 145 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి



నిజామాబాద్‌లో..



కామారెడ్డిలో

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు, ట్రైనీ కలెక్టర్ సంకేత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో అధికంగా 145 వినతులు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్ర మాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, సదరం సర్టిఫికెట్స్, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఈ రోజు ప్రజావాణిలో (145) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి లో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యా సాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, కామారెడ్డి ఆర్డీఓ వీణ, జడ్పీ సీఈవో చందర్, పలు శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

24న వరి ధాన్యం వేలం

- జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో వరి ధాన్యం సేకరణ వ్యవస్థలో రైసు మిల్లులో జరిగిన అవకతవకల్లో పట్టుకున్న వరి ధాన్యాన్ని ఈనెల 24 బహిరంగ వేలం వేయనున్నట్టు జిల్లా సరఫరాల శాఖ మేనేజర్ రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేస్సర్స్ సైరస్ ఆగ్రో ఇండస్ట్రీస్, మినార్ పల్లి, బోధన్ (లీజ్ దారుడు) , మేస్సర్స్ బాల గణపతి ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్‌లో నిలువ చేయబడిన వరి ధాన్యం దాదాపు 3932 క్వింటాళ్ళ (9830 సంచులు) "సరుకు ఎలా ఉన్నది అలా' పద్దతిన ఈనెల 24 సమయం 4 మధ్యాహ్నం ప్రదేశం మెస్సర్స్ సైరస్ ఆగ్రో ఇండస్ట్రీస్, మినార్ పల్లి, బోధన్ (లీజ్ దారుడు), మెస్సర్స్ బాల గణపతి ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్ లో బహిరంగ వేలం వేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ ద్వారా గుర్తింపు పొందిన బీవరేజస్, డిస్టిల్లరి సంస్థల ప్రతినిధులు (ప్రొహిబిషన్ , ఎక్సైజ్ శాఖల ద్వారా ఆమోదం పొందిన వారు మాత్రమే) నుంచి సీల్డ్ కొటేషన్, డాక్యుమెంట్ల రూపంగా కోరుతున్నట్టు తెలిపారు. కొటేషన్స్ ఈనెల 24న సమయం మధ్యాహ్నం 3 వరకు తీసకొనునున్నట్టు తెలిపారు. ప్రతినిధుల సమక్షంలో సీల్డ్ కొటేషన్ అదే రోజు సాయంత్రం 4 గంటలకు తెరువనున్నట్టు తదుపరి వివరాలకు జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయములో సంప్రదించాలని సూచించారు.

హోరాహోరీగా సాగిన వేలం

- పిట్లం తైబజార్ రూ.12.52 లక్షలు, పశువుల దాఖల చిట్టి రూ.6.58 లక్షలు

నవతెలంగాణ-పిట్లం



పిట్లం జీపీలో కొనసాగుతున్న వేలం

పిట్లం మండల కేంద్రంలో తై బజార్, పశువుల దాఖల, గొర్రెల , మేకల వేలంపాట హెూరా హెూరిగా సాగింది. సోమవారం పిట్లం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలం పాటను పంచాయతీ ప్రత్యేక అధికారి కమలాకర్ (ఎంపీడీవో) అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తై బజార్ వేలం పాటకు గాను నలుగురు కాంట్రాక్టర్ లు 2 లక్షల రూపాయలను ధరవత్ సొమ్ము డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనగా పంచాయతీ సిబ్బంది ముందుగా 20 లక్షల రూపాయల సర్కార్ సవాల్ పాట నిర్ణయించడంతో హెూరా హెూరిగా చతుర్ముఖ పోటిలో మండల కేంద్రములకు చెందిన గొల్ల లక్ష్మణ్ 12 లక్షల 51 వేల రూపాయల పాట పాడగా ఎల్లారెడ్డి డివిజన్ కేంద్రానికి చెందిన రామాగౌడ్ 12 లక్షల 52 రూపాయల పాట పాడి తై బజార్ వేలం పాటను దక్కించుకున్నారు. కాగా గత సంవత్సరం 11 లక్షల 35 వేల రూపాయలు వచ్చాయి.

పశువుల దాఖల చిట్టికి గాను సర్కార్ సవాల్ 10 లక్షల రూపాయల పాట నిర్ణయించగా వేలం పాటలో ఐదుగురు కాంట్రాక్టర్లు రెండు లక్షల ధరావత్ సొమ్మును డిపాజిట్ చేసి వేలం పాటలో ఒకరి కంటే ఒకరు మిన్నుగా వేలంపాట సాగగా చివరకు పత్తి హరీష్ , గజ్జల రమేష్ , వేలూరి నారాయణ లు త్రిముఖ పోటీ నెలకున్నప్పటికీ గజ్జల రమేష్ 6 లక్షల 58 వేల రూపాయల పాట పాడగా పత్తి హరీష్ 6 లక్షల 58 వేల రూపాయల పాట పాడి చివరి క్షణములో పశువుల దాఖలా చిట్టి బజారును కైవసం చేసుకున్నారు. కాగా గతేడాది 7 లక్షల 35 వేల రూపాయలు వచ్చాయి.

గొర్రెల మేకల బజార్‌కు గాను 6 గురు కాంట్రాక్టర్‌లు 2 రెండు లక్షల రూపాయలను డిపాజిట్ చేయగా 12 లక్షల రూపాయలను సర్కార్ సవాల్ పాట నిర్ణయించడంతో హెూరాహెూరీగా సాగిన వేలం పాటలో మండల కేంద్రానికి చెందిన సతీష్ ఆరు లక్షల రూపాయల పాట పాడగా బాన్సువాడ డివిజన్ కేంద్రానికి చెందిన నాటకారి రాజేష్ 6 లక్షల ఒక వెయ్యి రూపాయల పాట పాడినప్పటికీ ప్రభుత్వం నిర్ణయించిన ధర రానందున వేలం పాటను వాయిదా వేశారు. ఇట్టి వేలం పాటను తిరిగి 22 తారీకు నాడు గొర్రెల మేకల మేకల వేలం పాటను జరుపనున్నట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి కమలాకర్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ అధికారి బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బున్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

- అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాం
- ఏ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు
- తమకు ఇండ్లు ఇవ్వాలని కలెక్టరేట్‌కు వచ్చిన ఎల్లారెడ్డి వాసులు

నవతెలంగాణ-కామారెడ్డి

డబ్బున్నోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని, పేదలమైన తమకు ఇండ్లు ఇవ్వకపోవడంతో కిరాయి ఇండ్లల్లో అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్నట్టు ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని పలు డివిజన్ వాసులు వేడుకున్నారు. సోమవారం కామారెడ్డి ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకొని తమకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 1, 2, 7, 9 వార్డులకు చెందిన కుచ్చ ఎస్సీ బేడ (బుడగ) జంగం కులస్తులు రాష్ట్ర బిబిజె జన సంఘం ప్రచార కార్యదర్శి, కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆనరాశి గిరిని వెంకటి కలెక్టరేట్‌కు వచ్చారు. తమకు ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా రాలేదని అధికారులు పక్షపాతం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకే డబల్ బెడ్ రూమ్లను కేటాయించాలన్నారు. తమ కులానికి చెందిన 41 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్లు ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. గత 30 40 సంవత్సరాలుగా కిరాయి ఇండ్లల్లో అద్దెలు చెల్లించుకుంటూ నివాసం ఉంటున్న తమలాంటి పేదలకు లిస్టులో పేరు వచ్చిన తొలిగించి ఇండ్లు ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి తమకు ఇండ్లు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అల్లం పండరి, మరియు ఎర్రమన్ను కుచ్చ కులస్తులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన పేదలు

నా ఇద్దరు పిల్లలు మానసిక వికలాంగులు

కాశీరాం ఎల్లారెడ్డి

నాకు ఒక కొడుకు కూతురు ఉన్నారు. వారిద్దరు కూడా మానసిక వికలాంగులేనని తన పరిస్థితిని గత ఎమ్మెల్యే సురేందర్, ప్రస్తుత ఎమ్మెల్యే మదన్మోన్‌రావుకు కాళ్ల మొక్కి వివరించిన కనికరించలేదు. ప్రభుత్వమైన స్పందించి డబల్ బెడ్ రూమ్ కేటాయించాలి.

30 ఏండ్లుగా రేకుల ఇంట్లోనే అద్దె

భాజె సత్యవ ఎల్లారెడ్డి

గత 30 సంవత్సరాలుగా మేము రేకుల షెడ్డులో అద్దె చెల్లిస్తూ నివాసం ఉంటున్నాం. ప్రస్తుతం నాకు నా భర్తకు ఆరోగ్యం బాగోలేదు. ఇంటి అద్దె చెల్లించే పరిస్థితిలో లేము. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు డబుల్ బెడ్ రూములు ఇప్పించాలి.

మున్సిపల్ అయింది.. కరువు పని పోయింది

రాజవ్వ ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపల్ కావడంతో ఎల్లారెడ్డి మున్సిపల్ లోని మాలాంటి బీదలకు కరువు పని లేదు. అప్పటినుండి మేము జోలె వేసుకొని తిరుగుతున్నాము. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. అందులో తాగునీరు సైతం రావడం లేదు. అద్దె ఇళ్లలో ఉన్న మాకు డబల్ బెడ్ రూమ్లు ఇవ్వడం లేదు. మా పిల్లలు గురుకుల, కస్తూర్బా వసతి గహాల్లో చదువుకుంటున్నారు. వారికి ప్రభుత్వం పెన్నులు కానీ పుస్తకాలు కానీ ఇవ్వడం లేదు. అన్ని మేమే సమకూరుస్తున్నాం. అటు పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులకు గురి అవుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలి.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామంలోని 2006-2007 పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత నిజామాబాద్ లోని రిసార్ట్ లో సమ్మేళనం నిర్వహించారు. పదవ తరగతి వరకు మధుర క్షణాలు, మధురానుభూతులు, చిలిపి చేష్టలు నెమరు వేసుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకాని గోపి, ఎం శ్రీకాంత్, డి శ్రీకాంత్, సిహెచ్ రాజేంద్రప్రసాద్, ఏం అశోక్, జీ నవీన్, ప్రశాంత్, ఫయాజ్, రామకృష్ణ, ప్రసన్న, సవిత, పవిత్ర, వినోద, సౌమ్య సువర్ణ, స్వప్న, లావణ్య, జమున, పూర్ణిమ, వీళ్ళందరూ కలిపి వచ్చే 2027లో అందరం కలిసి మళ్ళీ ఆత్మీయ సమ్మేళనం చేసుకుందామని నిర్ణయించుకున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని 27 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని భీంగల్ మండల అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సంతోష్ కుమార్ నీటిసమస్యలపై మాట్లాడుతూ మూడు, నాలుగు గ్రామాలలో నీటికి సంబంధించిన సమస్య ఉందని, దానికోసమే ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ చర్యలతో సిద్ధంగా ఉన్నామని, ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సమయంలో ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. ఇంటి నల్లాలకు ఎవరు కూడా మోటార్లను బిగించవద్దని, అలా చేసినట్టు తెలిస్తే మోటర్‌ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

ట్రాఫిక్ ఏసీపీకి సన్మానం



ఏసీపీని సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ట్రాఫిక్ ఏసిపి నారాయణను సన్మానించారు. బుల్లెట్ బండికి ఎక్కువ శబ్దం చేసే సైలెన్సర్ బిగించి రోడ్డుపై నడిచే వారిని శబ్ద కాలుష్యంతో ఇబ్బంది పెడుతున్న వాహనదారులను అదుపులో తీసుకొని వారి సైలెన్సర్లను తొలగించి వారికి వార్నింగ్ ఇచ్చి వదిలేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 250 తొలగించిన సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించిన ట్రాఫిక్ ఏసిపి పట్టణానికి విచ్చేసిన సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ మాట్లాడుతూ.. వాహనం నడిపించే వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ వారి రక్షణ వారు చేస్తూ ఇతరులను ఇబ్బంది పెట్టకుండా వాహనం నడపాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాస ఆనంద్, మానస గణేష్, ఖాన్దేశ్ సత్యం, చేత స్వచ్ఛంద సేవ సంస్థ సెక్రెటరీ విద్యాసాగర్, ట్రాఫిక్ సిఐ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టి బొమ్మలు దహనం



దిష్టి బొమ్మలు దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండల అధ్యక్షులు బొదిరే స్వామి ఆధ్వర్యంలో అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలోని సుమంగళి చౌరస్తాలో సోమవారం జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని, బీఆర్ఎస్ నేతలు తమ వైఖరి ఇకనైనా మార్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జేజే నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు అనంతరావు,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, బీసీ సెల్ మండల అధ్యక్షులు కోరాడి రాజు, యువజన జిల్లా ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, పల్లె శేఖర్, సీఎచ్ గంగాధర్, మండల ఉపాధ్యక్షులు దొనకంటి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రూ.18 వేలు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలి

- కాంగ్రెస్ సర్కార్ ఆశ వర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశాలకు రూ.18 వేలు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని మార్చ్ 19న ఆశా వర్కర్ల సమస్యలపై చలో కలెక్టరేట్ ను జయప్రదం చేద్దామని, కాంగ్రెస్ ప్రభుత్వం అశ వర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం తహసిల్దార్ ప్రభాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షులు బోడికే శోభ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలపై మార్చ్ 19న కలెక్టరేట్‌వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సూచించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిందన్నారు. నాటినుండి నేటి వరకు ఆశాల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. కార్యక్రమంలో సిహెచ్ మంజుల,జి స్వప్న,పి రేణుకా,జి అరుణ,కె విజయ. పాటు తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌ను కలిసిన రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ-ఆర్మూర్

పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డిని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ అజీమ్ నాయకులు సోమవారం కలిశారు. కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్, గుండెం రమేష్, కోమన్ పల్లి కిషన్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు

- పది పరీక్ష మార్కుల్లో మినహాయింపు
- బరువుగా భావించకుండా బాధ్యతగా సేవ చేయాలి
- జిల్లా విద్యాధికారి పార్శి అశోక్
- దివ్యంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేస్తున్న డీఈవో

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దివ్యాంగ విద్యార్థులకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు ఉండటంతో పాటు పది పరీక్ష మార్కుల్లో పాస్ మార్కుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపును ఇస్తోందని జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ పేర్కొన్నారు. దివ్యాంగుల సేవను తల్లిదండ్రులు, విద్యా విభాగం ఉద్యోగులు బరువుగా భావించకుండా బాధ్యతగా భావించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌజింగ్ బోర్డ్ కాలనీలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్ లో జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) సంయుక్తంగా దివ్యాంగ విద్యార్థులకు సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం జిల్లా కోర్డినేటర్ పడకంటి శ్రీనివాస్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దివ్యాంగుల అవసరాన్ని గుర్తించి సహాయ ఉపకరణాలు అందజేస్తున్న ఆలింకో వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంతకు ముందు కో ఆర్డినేటర్ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత ఏడాది ఆగష్టులో శిబిరం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా 600 మంది దివ్యాంగ విద్యార్థులను ఆలింకో నిపుణులు పరీక్షించి 275 మందికి వివిధ సహాయ ఉపకరణాలు అవసరం అని నిర్ధారించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆలింకో నిధులు రూ. 23 లక్షల 28వేల 379 విలువైన పరికరాలను పం పిణీ చేస్తున్నా మన్నారు. మొదటి సారిగా కోటగిరి మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థి ముత్యపు వార్ ఈశ్వర్‌కి బ్యాటరీ సైకిల్, నిజామాబాద్ రూరల్ కి చెందిన షేక్ అవెజ్‌కు సెల్ ఫోన్ సైతం మంజూరయ్యాయని పేర్కొన్నారు. వీటితో పాటు 17 బ్రెయిలీ కిట్స్, 44 హీరింగ్ ఎయిడ్స్ , 63 వీల్ చైర్స్, 87 ఎమ్మార్ కిట్స్, 8 ట్రై సైకిల్స్, 5 రోలేటర్స్, 51 ఇతర పరికరాలు మంజూరు అయ్యాయన్నారు.. భవిత కేంద్రాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన దివ్యాంగ విద్యార్థులకు మంజూరు అయిన ట్రావెలింగ్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, బాలికలకు స్టైఫండ్, రీడర్ అలవెన్స్ త్వరలో విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయన్నారు. చంద్ర శేఖర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, ఎతేశాముల్లా తోపాటు ఆలింకో నిపుణులు సిబాసిస్ పట్నాయక్, రిషి, అరుల్ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు మనోధైర్యాన్ని నింపుతూ పరికారాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. డీఎం అండ్ హెచ్ వో ఆధ్వర్యంలో వైదులు సేవలు అందించారు. అనంతరం దివ్యంగులతో పాటు వారి తల్లిదండ్రులకు ట్రావెలింగ్ అల్లవెన్స్ ఇస్తూ భోజన సౌకర్యాన్ని కలిపించారు. ఈ శిబిరంలో ఐఈఆర్పీ లు ప్రకాష్, లింబాద్రి స్వామి, సంతోష్, శేఖర్, నగేష్ గౌడ్, జలంధర్, కిషన్ సాగర్, ఆనంద్, కిషన్, లక్ష్మణ్, ప్రసాద్, రాజ నర్సయ్య, విటలేశ్వర్, రాజేష్, వర ప్రసాద్, ప్రేమ స్వరూప, శైలజ, మౌలిక, రమాదేవి, రాధిక, వసుంధర, భారతి, సౌమ్య, పద్మజ, లత, పద్మ, ముత్తమ్మ శుభారాణి, స్పెషల్ టీచర్లు శ్రీనివాస్ రెడ్డి, గాంగమణి, మురళీ, సురేష్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

భూపతిరెడ్డిని విమర్శించే నైతికత బీజేపీకి లేదు

- పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్



మాట్లాడుతున్న పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

భూపతిరెడ్డిని విమర్శించే నైతికత బీజేపీకి లేదని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ రూరల్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉండి విమర్శించడం మంచిదే కానీ హద్దులు మీరి విమర్శిస్తే కాంగ్రెస్ శ్రేణులు ఊరుకోరని అన్నారు. ఇటుక బట్టీల ఎమ్మెల్యే అని విమర్శించారని, ఇటుకబట్టీల ఎమ్మెల్యే అంటే అసలు అర్థం ఏంటని ప్రశ్నించారు. ఆయన పదవికి గౌరవించలేదా.. ఇదేనా మీ సంస్కారం అంటూ మండిపడ్డారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురించి మీకేం తెలుసు అసలు కాంగ్రెస్ పార్టీ వచ్చి 14 నెలల సమయంలోనే రూరల్ నియోజవర్గంలో రోడ్లు, డ్రైనేజీలు, లైటింగ్ లు ప్రతి గ్రామంలో రకరకాల అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. గత ప్రభుత్వం దివాలా తీసిన బడ్జెట్ అప్పజెప్పినా కూడా సంవత్సర కాలంలోనే 300 కోట్ల పైన వెచ్చించడం భూపతి రెడ్డికే దక్కిందని అన్నారు.

పార్టీలు మార్చుకుంటూ వెన్నుపోట్లు పొడుస్తూ బిజెపికి వచ్చావని దుయ్యబట్టారు. బిజెపిలోకి వచ్చాక జిల్లాకు గాని నిజామాబాద్ రూరల్ నియోజవర్గానికి గాని నువ్వు చేసిన పని ఏమైనా ఉందా అంటే శూన్యం అని, తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. అయినా రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమి లేదని అన్నారు. సంస్కారంతో విమర్శించు కానీ భూపతి రెడ్డికి అక్రమాలు అన్యాయాలు చేసే అవసరం లేదని తెలిపారు. ఆయన సంపాదించే డాక్టర్ వృత్తిని వదులుకొని ఈ పదవిలోకి వచ్చారని, వృత్తిలో ఉన్నప్పుడే ఎంతో మందికి సేవలు చేశారని, అటువంటి భూపతిరెడ్డిని పట్టుకొని ఈ విధంగా మీరు మాట్లాడితే ఊరుకునేది లేదని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, భోజన్న, గంగాధర్, మురళి, దత్తు, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, శ్యామ్ సన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ధర్మా గౌడ్, మహేందర్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

25న నల్లవెల్లిలో ఫైలేరియా రక్త పూతల నమూనా కార్యక్రమం

- ఇంచార్జీ డిప్యూటీ సిఎం హెచ్ ఓ తుకారాం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెల 25 న ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో రాత్రిపూట ఫైలేరియా రక్త పూతల నమూనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్చార్జి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పేర్కొన్నారు. సోమవారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఇన్చార్జి జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. మండలంలోని చాంద్రాయన్‌పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. గన్నారంలో పూర్తయిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి ప్రహరీ గోడ అసంపూర్తిగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లను పరిశీలించి తగిన చికిత్స అందించాలని స్టాఫ్ నర్స్ గంగామణికి సూచించారు. జాతీయ టీకా నివారణ కార్యక్రమంలో భాగంగా టీకాలు నిలువ చేసే గది, రిఫ్రిజిరేటర్లను పరిశీలించారు. జాతీయ ఫైలేరియా నివారణ కార్యక్రమంలో భాగంగా ఫైలేరియా రక్తపూతల నమూనా సేకరణ గురించి లాబ్ టెక్నీషియన్‌కు వివరించారు. 25న నల్లవెల్లి గ్రామంలో ఫైలేరియా రక్త పూతల నమూనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ కు ఆదేశించారు. ప్రతి ఒక్క ఉద్యోగి సరియైన ప్రొఫార్మాలోనే సెలవు పత్రం ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ జేమ్స్ న్యూటన్, డిపిఎం. ఓ.శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు, వెంకట్ రెడ్డి ఆనంద్ పాల్గొన్నారు.

మైనార్టీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు

ఎంఐఎం జిల్లా అధ్యక్షులు ఫయాజుద్దీన్



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఎంఐఎం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారతదేశంలో మైనార్టీల అస్తిత్వాన్ని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందని జిల్లా ఎంఐఎం పార్టీ అధ్యక్షులు ఫయాజుద్దీన్ ఆరోపించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ముస్లిం పర్సనల్ లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వక్ఫ్ బోర్డ్‌లో సవరణలపై కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఐఎం పార్టీ జిల్లా అధ్యక్షులు ఫయాజుద్దీన్ మాట్లాడుతూ.. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం గల దేశమని, వివిధ మతాలు, కులాలు, సంస్కృతుల సంగమమని అన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వం విభజించు పాలించు అనే ధోరణిలో ప్రజలను విడదీస్తుందన్నారు. ప్రత్యేకించి ముస్లింలను శత్రువులుగా చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు ఢిల్లీ నుండి గల్లి వరకు నిరసన ధర్నా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ వక్ఫ్ బోర్డ్‌లో సవరణలు ఆపకపోతే రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎంఐఎం ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షాబాజ్, మాజీ కార్పొరేటర్ మునవర్ ఆలీ, నాయకులు సోహైల్ చౌస్, అమర్ ఫారూఖ్, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు ఇందల్‌వాయి మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మాల మహానాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఇందల్‌వాయి మాలమహానాడు మండల కమిటీని జిల్లా కమిటీ కార్యాలయంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా నీరడి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా పూజ్యం రవి కుమార్, ఉపాధ్యక్షులుగా అబ్బ శ్రీనివాస్, ఓడిగ గంగరాజ్యం, మల్లె శోభన్, కోశాధికారిగా పాశం నర్సింలు, కార్యనిర్వహాక కార్యదర్శిగా బైసీ సాయిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నీరడి గంగాధర్ మాట్లాడుతూ మాలల హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని, మాలల అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతామని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీరడి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి రమేష్, ఇందల వాయి మండల అధ్యక్షుడు నీరడి గంగాధర్, ప్రధాన కార్యదర్శి పూజ్యం రవి కుమార్, ఉపాధ్యక్షులు అబ్బ శ్రీనివాస్, ఓడిగ గంగ రాజ్యం, మల్లె శోభన్,కోశాధికారి పాశం నర్సింలు, కార్యనిర్వహాక కార్యదర్శి బైసి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- నియోజకవర్గ ఇంచార్జ్ నాగభూషణం



మోపాల్ : నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-మోపాల్/ఆర్మూర్

జాప్యం చేయకుండా వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని నియోజకవర్గ ఇంచార్జ్ నాగభూషణం అన్నారు. మండల కేంద్రంలో రిలే దీక్షలు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిష్టయ్య ఆధ్వర్యంలో సోమవారం కొనసాగాయి. ఈ దీక్షకు సంఘీభావం తెలపడానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జి గంధమాల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత చేపట్టకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 ఫలితాలు వర్గీకరణ అమలు పరచకుండా విడుదల చేయడం వల్ల మాదిగలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుంటే మాదిగలను మోసం చేయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అమలుపరిచి గ్రూప్స్ ఉద్యోగాల్లో మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్మూర్: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పి రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటస్వామి మాదిగ అన్నారు. సోమవారం ఆర్మూర్ పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే దీక్షలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని కోరారు. కార్యక్రమంలో మైలారం బాలు, పొన్నాల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

గోదావరి పరివాహక ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని, ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలని సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి జీరో అవర్ లో ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో ఏళ్ల పురాతన ఆలయాలు ఉన్న ఉమ్మెడ, కొండూరు,చిన్నాయానాం వంటి ప్రాంతాల్లో గల ఆలయాలు, గోదావరి తీరాన భూములకు పర్యాటక ప్రాంతాలు చేయడంతో ఎంతో మందికి ఉపాధి కలుగుతుందని అన్నారు. ఉమ్మడి నిజామబాద్ జిల్లాతో పాటు నిర్మల్ బాసర అతి దగ్గర ఉండడంతో త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దానితోపాటు స్థానిక యువకులకు ఉపాధి లభిస్తుందని, సిద్దుల గుట్ట అభివృద్ధి కోసం గతంలో దేవదాయ శాఖ మంత్రికి విన్నవించిన స్పందించలేదని అన్నారు, అంతేకాకుండా తన నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఏమి ఇచ్చాడని ప్రశ్నిస్తున్నారు. అసలు ప్రభుత్వం నియోజకవర్గం కోసం నాకేమిచ్చిందని నిధులు నేనేమీ ఇవ్వలేదు నియోజకవర్గానికి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు, కొడంగల్‌తో సమానంగా కాకున్నా కొంత అయినా నిధులు ఇవ్వాలని అన్నారు. జక్రాన్‌పల్లి ఎయిర్పోర్ట్ కోసం త్వరితగతిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇతర సర్వే రిపోర్ట్‌లు ఇచ్చి సహకరించాలని దీని ద్వారా జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు.

బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుకు చార్జి మెమో

- జారీచేసిన నిజామాబాద్ పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబుకు క్రమశిక్షణ చర్యలో భాగంగా ఛార్జ్ మెమోను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సోమవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేట లక్ష్మీ నరసింహా స్వామి జాతరలో బోయి భాగ్య అనే మహిళపై బోధన్ రూరల్ సీఐ కొట్టాడనే ఫిర్యాదు మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఐపిఎస్ స్పందించి బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబుపై పూర్తిస్థాయి విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యలో భాగంగా ఛార్జ్ మెమో విడుదల చేశారు.

సిపిని కలిసిన బామ్ సేఫ్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాకు నూతనంగా వచ్చిన నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్యని సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బామ్ సేఫ్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు కమిషనర్ ఆప్యాయంగా పలకరించి సమస్యలు విన్నారు. జిల్లాలో అట్రాసిటీస్, గ్రామాభివృద్ధి కమిటీల దాడులు మరియు వెలివేతలు సోషల్ బాయ్ కాట్‌లపై సుదీర్ఘంగా చర్చించారు. ఎక్కడ వివక్షత కొనసాగితే అక్కడ కఠినమైన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. సిపిని కలిసిన వారిలో బామ్ సేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బి. చెన్నయ్య, టీఎస్ ఏవైఎస్ ప్రధాన సలహాదారు కొమ్ము రాజమల్లు, ఎస్సీ, ఎస్టీ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై విజయ్ కుమార్, బుద్దిస్ట్ ఇంటర్నేషనల్ నెట్వర్క్ జిల్లా కన్వీనర్ మాదారపు రాములు, టీఎస్ ఏవైఎస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాటల మహేందర్ తదితరులు పాల్గొన్నారు..

గ్రామ సంతల వేలం

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో 2025-2026 సంవత్సరానికి సంబంధించి గ్రామ సంతల వేలం ఈ నెల 19 న నిర్వహించడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. వారం సంతకు డిపాజిట్ 50వేలు, రోజువారి సంతకు డిపాజిట్ 35వేలు డిపాజిట్ 20వేలు చెల్లించి ఆసక్తిగల అభ్యర్థులు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్సీ శంకర్ నాయక్‌ని కలిసిన మానాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎకగ్రీవంగా ఎన్నికైన నల్గొండ డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్‌ను (తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్) జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మర్యాద పూర్వకంగా సోమవారం కలిసి సన్మానించారు. ఆయనతో పాటు మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగడం సుమన్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు గైని రాజలింగం సోమవారం తెలిపారు. హెల్పింగ్ బ్రిడ్జి ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు దమ్మనగారి సంగారెడ్డి, సంస్థ ప్రతినిధి కృష్ణకర్‌రావుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసినట్టు తెలిపారు.


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

కృత్రిమమేధ తరగతులను ప్రారంభించిన ఎంఈవో

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని కుర్నపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నుంచి కృత్రిమ మేధ (ఏఐ) తరగతులు ప్రారంభించినట్టు మండల విద్యాశాఖ అధికారి శివలింగ్ గాలప్ప తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







కామారెడ్డి: సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశావర్కర్లు, జుక్కల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత, రాజంపేట్: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత, బిచ్కుంద: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి
- సిఐటీయు నాయకులు ఎమ్‌డీ ఖలీల్
- సబ్ కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-బాన్సువాడ(కామారెడ్డి)/జుక్కల్/తాడ్వాయి / రాజంపేట్/బిచ్కుంద

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం బాన్సువాడ పట్టణంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ సబ్ కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. అలాగే నసురుల్లాబాద్ మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే బీర్కూరు మండలం ఆశా కార్యకర్తలు తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా సీఐటీయూ నాయకులు కలిల్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయన్నారు. ఆశలకు కనీస వేతనం ఇవ్వాలని, పనికి తగిన పారితోషికం అంటూ ఇతర పనులు చేయించడం సిగ్గుచేటని అన్నారు. 45వ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసు మేరకు ఆశలను కార్మికులుగా గుర్తించి ఉద్యోగ భద్రత, 18 వేల కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధత సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఆశ కార్యకర్తలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించకపోవడం సిగ్గుచేటని తెలిపారు. 18 సంవత్సరాలుగా పనిచేస్తున్నా కనీస వేతనం అమలుకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వాలు గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర నాయకులు సుమలత, గంగమణి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జుక్కల్ తాహసిల్దార్ హిమబిందుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 25వ తేదీ నుంచి అక్టోబర్ 9 వరకు 15 రోజులు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేశారని తెలిపారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు స్థానిక ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసి విజ్ఞాపన పత్రము అందించిన నేటికీ ఎటువంటి హామీలు నెరవేర్చకపోవడంతో ఆశాలు తీవ్రమైన ఆందోళనకు గురవుతూ ఉన్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్ల హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

తాడ్వాయి : ఆశాలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ రహీముద్దీన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. బడ్జెట్ సమావేశాల్లో రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని ఏఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన ఆశాలకు ప్రమోషన్లు కల్పిస్తూ ఏఎన్ఎంగా నియమించాలని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.50 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రతి ఆదివారం పండగలకు సెలవులు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, తమకు పనిభారం తగ్గించి పారితోషకం లేని పనులు చేయించొద్దని ఆసుపత్రుల్లో ఇప్పటివరకు లేని రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సి ఏరియల్ చెల్లించాలని పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎర్రపాడు వైద్యాధికారికి సైతం వినతిపత్రాన్ని అందజశారు. కార్యక్రమంలో జి.లావణ్య, కే.జ్యోతి, జి.సుజాత, ఎస్.స్వప్న, సంతోషి, సిహెచ్.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట్ : ఆశా కార్యకర్తలు తమ డిమాండ్లను పరిష్కరించాలని మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దా ర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆశాకార్యకర్తలు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల నుంచి అరకొర వేతనాలతో జీవితాలను వెళ్ళదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించేలా రూ.18 వేలు నెలసరి వేతనం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి..

బిచ్కుంద : అసెంబ్లీ సమావేశాల్లో ఆశా కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు, ప్రమోషన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ మండలంలోని ఆశా కార్యకర్తలు తహసిల్దార్ సురేష్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు ఐఏఎస్ అధికారులతో కమిటీ వేయించి ఆశాల సమస్యల ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. 2024 ఫిబ్రవరి 9న, జూలై 30న, డిసెంబర్ 10న ఆరోగ్యశాఖ కార్యాలయం ముందర చేసిన ధర్నాలలో ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీల మేరకు 50లక్షల ఇన్సూరెన్స్ దహన సంస్కారాల కోసం రూ.50 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సెలవులు, టార్గెట్లు రద్దు చేస్తామని ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపి త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఆమె వెంట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు ఉన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఒడ్డెపల్లి గ్రామం గుండా ప్రవహిస్తున్న నీటిలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైన ఘటన కలకలం రేపింది. ఒడ్డేపల్లి గ్రామ కార్యదర్శి మధు మాసుల రమేష్ ఈ విషయాన్ని పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సమాచారం ప్రకారం.. ఈ మృతదేహం దాదాపు నెల రోజులుగా నీటిలో ఉండి పూర్తిగా కుళ్లిపోయిందని, ఇది నిజాంసాగర్ డి46 కెనాల్ ద్వారా కొట్టుకు వచ్చి ఉండే అవకాశం ఉందని అనుమానిస్తున్నట్టు తెలిపారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరికైనా సంబంధించిన ఆధారాలు ఉంటే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వంశీ కృష్ణరెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

- పరీక్ష అట్టలు వితరణ


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శెట్పల్లిలో 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ వీడ్కోలు సమావేశంలో పదవ తరగతి విద్యార్థులు వారి అనుభవాలను, మధురస్మృతులను ఉపాధ్యాయులు చెప్పిన తీరును పాఠశాల పాఠశాలలో చదువుకున్న అనుభూతులను గుర్తు చేసుకొని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఏ విధంగా ఉండాలి, ఏ విద్యను అభ్యసించాలనే విషయాలను మోటివేట్ వివరించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులను చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో లింగంపేట్ వాస్తవ్యులు మహారాజ్ గురునానక్, ఫర్టిలైజర్ ఓనర్ దేవిసింగ్, పదవ తరగతి (26 మంది) విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన ఎక్సామ్ ప్యాడ్స్, పర్సు, పెన్ను, పెన్సిల్లను వితరణ చేశారు. అలాగే విద్యార్థులను మెరిట్ చేసి పదవ తరగతిలో మంచి మార్కులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుధ రాజయ్య, రవి, రజిత, ప్రదీప్, అశోక్, ప్రవీణ్, సంతోష్, రాజేష్, సిఆర్పి రాజు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పేట్‌లో హనుమాన్ పడిపూజ

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామంలో సోమవారం హనుమాన్ నామస్మరణ మహా పడిపూజ కార్యక్రమాన్ని హనుమాన్ స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు సంతోష్, గణేష్, సంజు, బాలు, సిద్దు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నుంచి ఏడుకు..

- ప్రజావాణి కార్యక్రమానికి పెరిగిన అధికారుల సంఖ్య

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఎప్పుడు చూసినా నాలుగు శాఖల అధికారులే హాజరవుతున్నారు. మిగతా శాఖల అధికారులు హాజరు కావడం లేదు. ఆ అధికారుల చర్యలు శూన్యమే. ఇదే విషయమై నవతెలంగాణ దినపత్రికలో గత వారం రోజుల క్రితం వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు.. ప్రజావాణికి ఎక్కువ మంది అధికారులు హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినా పూర్తిస్థాయి అధికారులు ప్రజావాణిలో పాల్గొనకపోవడం ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి అధికారులు హాజరుగా ఉండేలా ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం తహసీల్దార్ ఎండి ముజీబ్, ఎంపీడీవో రాణి, అగ్రికల్చర్ ఏవో రాజు, ఐకెపి ఆరోగ్యశాఖ ఆర్‌డబ్ల్యూఎస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

సేవలతో ప్రజలకు దగ్గరవ్వాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

పోలీసులు సేవలతో ప్రజలకు మరింత దగ్గర అవ్వాలని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చూడాలని ఆయన అన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ అన్ని గ్రామాలలో విస్తృతంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట బాన్సువాడ డి.ఎస్.పి సత్యనారాయణ, రూరల్ సీఐ రాజేష్, ఎస్సై శివకుమార్ తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

ఇందిరమ్మ ఇండ్ల మార్కౌట్

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బంగారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి జుక్కల్ ఎంపీడీవో సోమవారం మార్కౌటింగ్ వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొదటి విడతగా బంగారుపల్లి గ్రామానికి ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం కొరకు స్థలం సేకరణ చేసుకోవాలని సూచించారు. కొత్త ఇంటి నిర్మాణం కోసం అధికారులను గ్రామాలకు పిలిపించుకొని నిర్మాణ స్థలంలో అధికారుల సమక్షంలో మార్కౌటింగ్ చేయాలని లబ్ధిదారుల కోరిక మేరకు గ్రామాలకు సందర్శించిన అధికారుల సమక్షంలో గ్రామస్తులతో కలిసి మార్కౌటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామపెద్దలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.


ఇండ్ల మార్కౌట్ చేస్తున్న అధికారులు

ఉన్నత పాఠశాలలో ఘనంగా వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ఈ వీడ్కోలు సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారికి ఘనంగా సన్మానించి వారి పిల్లల హాల్ టికెట్స్‌ను తల్లిదండ్రుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను చెప్పుకొని కన్నీటి పర్యంతమయ్యారు. తాము భవిష్యత్తులో చదువులో రాణించి మంచి స్థాయిలో ఉంటామని ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు హామీనిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంత్‌రెడ్డి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, స్కేల్స్, అందించి పరీక్షలో బాగా రాణించి ఉపాధ్యాయుల తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులకు శాలువాలతో సత్కరించారు. సమావేశంలో అతిథులుగా ఎంఈఓ తిరుపతయ్య, ఖండెబాల్లూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్, జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించిన పాఠశాల బృందం

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నవతెలంగాణ-తాడ్వాయి/రామారెడ్డి

మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ బి సురేఖ తెలిపారు. ఎనిమిది గంటలకు సిబ్బంది పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు సోమవారం,ఎకనామిక్స్ ,ఫిజిక్స్ పరీక్షలకు 189 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 185 మంది విద్యార్థిని విద్యార్థులు హాజరు కాగా ఇద్దరు గైరాజ రయ్యారని తెలిపారు.

రామారెడ్డి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 136 మంది విద్యార్థులు హాజరై, ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అంగరంగ వైభవంగా ఆలయ బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవాల సందర్భంగా ఆలయ ఈఓ శ్రీధర్ ఆలయానికి వచ్చే భక్తుల కోసం అన్నదానం, తాగునీరు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం భక్తులు కానుకలు, ఓడి బియ్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మండల, పట్టణ ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష ప్యాడులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి అందజేశారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి మండలాన్ని అగ్రస్థానంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజా గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, కేజీబీవీ ఎస్ఓ హరిప్రియ, ఉపాధ్యాయ బృందం, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ స్వామి, కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మమత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- మండలాధ్యక్షులు మహేందర్ రెడ్డి


మాట్లాడుతున్న మండలాధ్యక్షులు మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని మండలాధ్యక్షులు మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యంగా భావించి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పది సంవత్సరాలు పాలించిన గత పాలకులు గ్రామాలను అభివృద్ధి చేయలేకపోయారని, అభివృద్ధి చేయకపోవడంతో ప్రజలు విసిగిపోయి ప్రజల మేలు చేసే ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని గ్రహించి కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోకి అధికారంలోకి తెచ్చారన్నారు. మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డు నుంచి పాపారేశ్వర మందిర్ వరకు 30 లక్షల వ్యయంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా పనులు ప్రారంభించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శామప్ప పటేల్, అక్కల్ సాయి రెడ్డి, చిప్ప మోహన్, కల్లూరు పండరి, బసవరాజ్ దేశాయ్, సంతోష్ దేశాయ్, సంజీవ్, విట్టల్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడటంపై మండల వాసుల హర్షం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని సంతాయిపేట్ గ్రామ సమీపంలో గల భీమేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే ప్రస్తావించడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీలో మండలంలోని మారుమూల ప్రాంతమైన భీమేశ్వర ఆలయాన్ని గుర్తుచేసి ఆలయ అభివద్ధికి నిధులు ఇవ్వాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కష్ణారావును దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరడంతో వారు సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి తెలిపారు. మాజీ సిడిసి చైర్మన్ మద్ది మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గైన శివాజీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అంబీర్ శ్యామ్‌రావు, భీమేశ్వర ఆలయ పూజారి, గ్రామాభివద్ధి అధ్యక్షులు మేకల రాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మెట్టు చంద్రం, యూత్ అధ్యక్షులు గుట్టకాడి రంజిత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దుడ్డే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధరామేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో అధ్యక్షులు పురాం రాజమౌళి ఆలయానికి వచ్చే భక్తుల కోసం చల్లటి తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, పట్టణ ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 831 మంది ఆబ్సెంట్

● ఒక విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం మొదటి సంవత్సరం ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలిపారు. మొత్తం 831 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. కాగా సోమవారం డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాపీయింగ్ చేస్తున్న ఒక విద్యార్థి పై మాల్ ప్రాక్టీసు కేసు నమోదు చేశామని చెప్పారురు. జిల్లాలో మొత్తం 20,110 మంది విద్యార్థులకు గాను 19,279 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 95.9 శాతం విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీటీలు రాస్తున్న ఓ విద్యార్థి ని చీఫ్ సూపరింటెండెంట్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేశారని తెలిపారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 54 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

లిల్లీపుట్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ శిరోమణి కార్యక్రమం సోమవారం జావిద్ భాయ్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. బెలూన్స్‌తో స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, ఖోఖో వంటి ఆటలను ప్రారంభించి వారిని ఆటలు ఆడించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి రామకృష్ణ వాలీబాల్ మల్లేష్ గౌడ్ సాఫ్ట్‌బాల్ సెక్రటరీ గంగ మోహన్, రత్నాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఆటలు చాలా ప్రాముఖ్యమని ప్రతి స్కూల్లో ఖచ్చితంగా ఒక పిరియడ్ నిర్వహించడం వల్ల వారికి మంచి వ్యాయామంగా ఉంటుందని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో కచ్చితంగా ఒక పిరియడ్ ఆటలకు నిర్వహిస్తామని పిల్లలందరూ 30 నిమిషాలైనా ఆటలు ఆడాలని తమ చిన్ననాటి జ్ఞాపకాలను విద్యార్థులకు తెలిపారు పాఠశాలలోని పిటి సార్ అనిల్ కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్
జిల్లా అధ్యక్షునిగా బోయిని శ్రీధర్ నియామకం



నియమకపత్రం అందుకుంటున్న శ్రీధర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన బోయిని శ్రీధర్ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షునిగా ఆదివారం రాత్రి నియామక పత్రం అందుకున్నారు. హైదరాబాదులోని రీగాల్స్ హెూటల్‌లో జరిగిన సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ చేతుల మీదుగా జిల్లా ప్రెసిడెంట్‌గా బోయిని శ్రీధర్ ఐడి కార్డు, అనుమతి పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో తనవంతు పాత్ర పోషిస్తానని, బాల్యవివాహాలను అరికట్టడంలో ముందుంటానని, మత్తుకు యువత చిత్తుకాకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తానని తెలిపారు.. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ జనరల్ సెక్రెటరీ మామిడాల మనోహర్, సౌత్ ఇండియా చైర్మన్ డాక్టర్ గంప హనుమా గౌడ్, ఉత్తర తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాప పండరి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి

● మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్



ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి పన్ను బకాయి చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ అన్నారు. ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ కోసం పట్టణంలో వివిధ వార్డుల్లో ఐదు బృందాలను ఏర్పాటు చేశామని, వారికి ఆస్తి పన్ను చెల్లించి సహకరించాలని తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించకపోతే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పట్టణంలో గల మైనార్టీ రెసిడెన్షియల్ హాస్టల్‌ను సోమవారం కమిషనర్ తనిఖీ చేశారు. హాస్టల్లోని స్టాక్ రిజిస్టర్, వంటగదిని కూరగాయలు, స్టోర్ రూమ్‌ని పరిశీలించారు. పిల్లలకు మెను ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫిర్యాదు బాక్స్ ను ఓపెన్ చేశారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలి

● మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పదవ తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించి మాస్ కాపీయింగ్ ను అరికట్టాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 21 నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, పేరు పొందిన కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ర్యాంకుల కోసం మార్కుల కోసం పరీక్షల సెంటర్స్ నిర్వాహకులతో మాట్లాడుకొని లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయని అన్నారు. మాస్ కాపీయింగ్ జరగడం వల్ల కష్టపడి చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. మాస్ కాపీయింగ్‌ను అరికట్టి పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యా సంస్థలు రాయితీల పేరుతో విద్యార్థులను తల్లిదండ్రులను మోసం చేస్తూ ముందస్తుగా అడ్మిషన్స్ చేసుకుంటున్నారని, అనుమతి లేని ప్రవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దివిక, మనోజ్, సాయి కిరణ్, గౌతం, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో గొడ్డలితో దాడి

నవతెలంగాణ-మాక్లూర్

మద్యం తాగి స్నేహితునిపై దాడి చేసి గాయాలపాలు చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి ఆలూరు మండలంలోని కల్లెడ గ్రామంలో ఇద్దరు స్నేహితులు మద్యం తాగి ఒక్కరిపై గొడ్డలితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లెడ గ్రామానికి చెందిన దేవలి పోశెట్టి అనే వ్యక్తి సోమవారం దుబాయ్ వెళ్ళవలసి ఉంది. తన స్నేహితుడైన తెడ్డు లింగం కు మద్యం తాగించడానికి పిలిచి ఆయన ఇంటి ముందు కూర్చుని తాగారు. రాత్రి 10 గంటల తరువాత పోషెట్టి భార్యను లింగం పిలిచి నీభర్తను తీసుక వెళ్ల మని చెప్పాడు. ఆమె వచ్చి చూసేసరికి పోశెట్టి రక్తపు మడుగులో ఉన్నాడు. ఏం జరిగిందని అడిగితే తానే గొడ్డలితో నరికనాని చెప్పినట్లు తెలిపారు. పోషెట్టి కుడి భుజంపై, ఎడుమ ఛాతీపై, మోకాలిపై, అర చేతిపై కొడ్డలితో నరికిన గుర్తులు ఉన్నాయని, క్షత గాత్రున్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి 108 లో తరలించమన్నారు. పోషెట్టి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంఛార్జి ఎస్సై లస్మయ్య తెలిపారు.

ప్రొఫెసర్ నాయుడు అశోక్ సతీమణి మృతి

● పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే సీతక్క

నవతెలంగాణ-ఏర్గట్ల



నివాళ్లు అర్పిస్తున్న మంత్రి సీతక్క

మండలానికి చెందిన తొర్తి గ్రామ వాస్తవ్యులు, నిజాం కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నాయుడు అశోక్ సతీమణి నాయుడు సువర్ణ సోమవారం మృతిచెందింది. ఆమె గురువు సతీమణి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న మంత్రి సీతక్క హైదరాబాద్‌లోని నాయుడు అశోక్ ఇంటికి వెళ్ళి సువర్ణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా సువర్ణ పార్థివదేహాన్ని ఆమె స్వగ్రామం తొర్తికి తీసుకువచ్చి అంత్యక్రియలను నిర్వహించారు.

పసుపు ఖరీద్‌దారుల సిండికేట్ కుట్రలను అరికట్టాలి



● సాంగ్లీలో పలుకుతున్న ధర దక్కేలా చూడాలి
● రూ.15వేలు మద్దతు ధర అందించాలి
● అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పసుపు ఖరీద్ దారుల సిండికేట్ కుట్రలను పరిష్కరించి, పసుపు రైతుకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంగ్లీలో పసుపునకు పలుకుతున్న ధర నిజామాబాద్ గంజ్‌లో కూడా దక్కేలా చూడాలన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్ జిల్లాలకు చెందిన 8 నియోజకవర్గాల పసుపు రైతుల సమస్యను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన పసుపు రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను సభలో ప్రస్తావిం చారు. నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, బాల్కొండ, నిజమా బాద్ రూరల్, జగిత్యాల జిలాల్లో జగిత్యాల, కోరుట్ల, నిర్మల్ జిల్లాలో నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాలకు చెందిన పసుపు రైతులు పండించిన పసుపును అమ్ముకునే సమయంలో అనేక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో సభ దృష్టికి తెచ్చారు. ఎనిమిది నియోజకవర్గాల పసుపు రైతులు పండించిన పసుపును నిజామాబాద్ గంజ్‌కి తీసుకువచ్చి అమ్ముకుంటా రన్నారు. ఈ సీజన్ ప్రారంభంలో నిజామాబాద్ మార్కెట్‌లో రూ.12వేలకు అమ్ముడు పోయిన పసుపు, ఇప్పుడు రూ.8వేలకు అమ్ముడు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పసుపును మహారాష్ట్రలో సాంగ్లి మార్కెట్‌కి తీసుకెళ్తే రూ.13 నుంచి 14 వేలకు అమ్ముడు పోతుందన్నారు. నిజామాబాద్‌లోని ఖరీద్ దారులు సిండికేట్ అయ్యి కొందరు అధికారుల సహకారం తీసుకొని ధరను తగ్గిస్తున్నారని స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. రైతులు ధర తగ్గి నష్టపోతుండటంతో ఈ మధ్యనే పసుపు రైతులు రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలియజేసారని తెలిపారు. ఒకే రకమైన పసుపు నిజామాబాద్‌లో ఒక రేటుకి, సాంగ్లిలో ఒక రేటుకి అమ్ముడుపోతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మధ్యనే పసుపు బోర్డు ఏర్పాటు కావటంతో రైతులు పసుపుకి మద్దతు వస్తుందని ఆశించారన్నారు. బిజెపి పసుపు బోర్డు ఏర్పాటుతో పాటు రూ.15వేల మద్దతు ధర ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పసుపు బోర్డు ఏర్పడక ముందు గత సంవత్సరం రూ.16వేల ధర పలికిన పసుపు ఈ సంవత్సరం బోర్డు ఏర్పడ్డాక 8వేలు, 9వేలు పలుకుతుందని ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఖరీదు దారులు సిండికేట్ అయ్యి ఆన్లైన్‌లో రెండు మూడు కుప్పలు కొని మిగతావి కొనకపోయే సరికి రైతులు చివరకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఖరీద్ దారుల సిండికేట్ కుట్రలను పరిష్కరించి, వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం, పసుపు బోర్డుతో మాట్లాడి రూ.15వేల మద్దతు ధర అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పసుపు రైతుల సమస్యలను పరిష్కరించి, మద్దతు ధర అందించి న్యాయం చేయాలని సభ ద్వారా ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నేడు నడిపల్లి తైబజార్ వేలం



● ఔత్సాహికులు హాజరుకావాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని నడిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కి సంబంధించిన తై బజార్ వేలం మంగళవారం నిర్వహిస్తున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి కార్యదర్శి నిట్టు కిషన్ రావు సోమవారం తెలిపారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. 18న డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలంపాట ప్రారంభమవుతుందని, వేలంలో పాల్గొనే వారు ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుందని వివరించారు. వేలంలో పాల్గొనే వారు 50 వేల రూపాయలు ముందుగా గ్రామ పంచాయతీలో డిపాజిట్‌గా చెల్లించి రశీదు పొందాలని సూచించారు. డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలంలో పాల్గొనడానికి అనుమతించ బడుతుందని పేర్కొన్నారు. గతేడాది కౌలు బకాయిలు ఉంటే పంచాయతీకి ముందుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పంచాయతీలో ఎలాంటి బకాయిలు ఉన్నా వేలం పాటలో పాల్గొన వద్దని, లక్ష రూపాయల ఆస్తి, ధ్రువ పత్రం సంబందిత పంచాయతీల కార్యదర్శుల సంతకంతో జారీ చేసి ఉండాలని పేర్కొన్నారు. యాజమాని సంతకం ఉంటేనే అంగీకరించ బడుతుందని వివరించారు. వేలం దక్కించుకున్న వారు చెల్లించిన డిపాజిట్, ధరావత్తు కలుపుకొని నాలుగో వంతు చెల్లించాలని వివరించారు. వేలంలో కనీస ధర రాని పక్షంలో రద్దు పరచే అధికారం గ్రామ పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. కాంట్రాక్టర్ గ్రామ పంచాయతీ ఆమోదించబడిన రేట్లను మాత్రమే వసూలు చేయవల్సి ఉంటుందని, అంతకు మించి వసూలు చేస్తే వేలంను రద్దు చేస్తామని తెలిపారు. వేలం పాడుకున్నవారు ఏదైన కారణాలతో నెలసరి వాయిదాలు చెల్లించకపోతే వేలం హక్కులు రద్దు చేసి తిరిగి వేలం వేసే అధికారం పంచాయతీకి ఉందని పేర్కొన్నారు. రెండవ వేలం ద్వారా వచ్చిన నష్టాన్ని మొదటి వేలం పొందిన వ్యక్తి నుండి వసూలు చేయబడుతుందని వివరించారు.

ఓయుకు సురవరం పేరు పెట్టాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఉస్మానియా యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు మార్పుపై అసెంబ్లీలో సోమవారం పెట్టిన తీర్మానంపై నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకస్తున్నామని అన్నారు. ఇది తెలుగు ప్రజల మనోభావాలను దెబ్బతీసే ఒక అవివేకపు చర్య అని, తెలుగు యూనివర్సిటీ అంటేనే గుర్తుకు వచ్చేది పొట్టిశ్రీరాములు పేరని అన్నారు యూనివర్సిటీ పేరు మార్పును రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలనీ సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

పొట్టి శ్రీరాములు త్యాగం మర్చిపోలేని చరిత్ర

పొట్టి శ్రీరాములు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదని, దేశం గర్వించే మహనీయులలో ఒకరని స్వాతంత్ర పోరాటంలో గాంధీతో కలిసి పనిచేసి, ఖాదీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారన్నారు.

పొట్టి శ్రీరాములు కేవలం భాషాపరమైన ఉద్యమం కోసం మాత్రమే కాకుండా, దళితుల హక్కుల కోసం అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులని, దళితులను గుడులలోకి ప్రవేశింపచేయాలనీ నిరాహార దీక్ష చేసి మద్రాసు ప్రభుత్వం చేత హరిజనోద్ధరణ శాసనాలను ఆమోదింపజేసిన మహనీయులని అన్నారు.

తెలుగు రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం..

ప్రత్యేక తెలుగు రాష్ట్ర ఏర్పాటుకు పొట్టిశ్రీరాములు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించారని, వారి త్యాగం వల్లే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని అన్నారు. తెలుగు భాష గౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి పొట్టి శ్రీరాములు పేరు మార్పు పై తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

సురవరం ప్రతాపరెడ్డి పత్రిక సంపాదకులుగా, పరిశోధకులుగా, పండితులుగా, రచయితగా, క్రియాశీలక ఉద్యమకారునిగా నిజాం నిరంకుశ పాలనలో తెలుగు వారిపై జరుగుతున్నా అఘాత్యాలను, అవమానాలకు వ్యతిరేకంగా తన కలంతో ప్రజలను చైతన్యం చేసిన మహనీయులని అన్నారు. అలాంటి ఆయన పేరు చిరస్థాయిగా నిలవాలంటే ప్రతేక తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని డిమాండ్ చేశారు. ఆనాడు తెలంగాణ సాయుధ పోరాటం జరిగిందే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అని అలాంటి నిజాం పేరు మార్చి సురవరం పేరు పెట్టాలని అన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగిస్తే ఆర్యవైశ్య జాతి మొత్తం ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే విధంగా ఒక ఉద్యమాన్ని లేవనేత్తుతామని హెచ్చరించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సురవరం ప్రతాప్ రెడ్డి పేరు ఉస్మానియా యూనివర్సిటీకి పెట్టాలని ఇదే తెలంగాణ ఉద్యమ చరిత్రకు నిజమైన గౌరవ నివాళి అన్నారు.

ఎన్నారై పాలసీ రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లింపు



కృతజ్ఞతలు తెలుపుతున్న బాధిత కుటుంబీకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కోట భూమేశ్వర్ గుండెపోటుతో గత సంవత్సరం జూన్ నెలలో గల్ఫ్ దేశమైన దుబాయ్‌లో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నారై పాలసీ ద్వారా 'ఎక్స్ గ్రేషియా' రూ.5 లక్షల సోమవారం బాధిత కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబానికి తెలియజేశారు. మృతి చెందిన కోట భూమేశ్వర్ 30 సంవత్సరాలుగా గల్ఫ్ లో జీవనం సాగిస్తున్నట్లు కుటుంబసభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. టీజీ యండీసీ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధిత కుటుంబీకులు కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, కిసాన్ ఖేత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం సాగర్, గోపిడి రాజారెడ్డి, సురేష్ గౌడ్, చిన్నారెడ్డి, నర్సారెడ్డి, శంకర్, రాజేశ్వర్ గౌడ్, రాకేష్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలి

● నగర పాలక సిబ్బంది

నవతెలంగాణ-నిజామాబాద్



ఇంటిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇంటి పన్నులు బకాయిలు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పడాలని నగర పాలక అధికారులు కోరారు. సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈనెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది కావున ప్రజలు బకాయి ఉన్న పనులు చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నారు. అందులో భాగంగా సోమవారం 37వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో పన్నులు వసూలు చేశారు.

కాంగ్రెస్ ది మాదిగల వ్యతిరేక పాలన

● ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ
● దీక్షలకు జమతే ఇస్లాం, ఎంబిటి ముస్లిం నాయకుల మద్దతు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చెయ్యకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం యొక్క తీరును నిరసిస్తూ జరుగుతున్న నిరసన దీక్షలు సోమవారానికి ఆరవ రోజుకు చేరుకున్నాయని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ తెలిపారు. ఈ దీక్షకు జామతే ఇస్లాం, ఎంబిటీ ముస్లిం సంఘాలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఒకవైపు స్వాగతిస్తునే ఇంకో వైపు డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారన్నారు. బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలలో మార్చ్ 12న వర్గీకరణ చట్టం తీసుకొస్తామని చెప్పి ఆ తర్వాత మాల సంఘాలు ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ని, ఆర్‌పిఐ అధ్యక్షులు, ఎంపీ రాందాస్ హతవలె ని కలిసి వర్గీకరణ చట్టాన్ని తేవొద్దు అని చెప్పడంతో మార్చ్ 12 నాడు రావాల్సిన బిల్లు 17కు ఆ తర్వాత మార్చ్ 18 న బిల్లు పెడతామని కాలయాపన చేస్తున్నారని అన్నారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్ మాదిగ, ఎంఎంఎస్ జాతీయ నాయకురాలు యమున, సత్తెక్క, ఎంఎంఎస్ జిల్లా నాయకురాలు స్వప్న మాదిగ, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షులు మహేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు, జమాతే ఇస్లాం నాయకులు హుస్సేన్, మాజీ కార్పొరేటర్ ఎంఏ ముకీత్, ఎంబీటి జిల్లా సెక్రటరీ షేక్ అమ్జద్, సామాజిక కార్యకర్త వసి అహ్మద్, జహీరుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

లొద్ది రామన్న కళ్యాణ మహోత్సవానికి రండి

● పీసీసీ అధ్యక్షునికి ఆహ్వానం



లొద్దిరామన్న కల్యాణానికి రావాలని ఆహ్వానిస్తున్న వీడీసి సభ్యులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పిప్రి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన లొద్ది రామన్న కల్యాణ మహెూత్సవ వేడుకలకు రావాలని పీసీసీ అధ్యక్షులు, భీంగల్ మండల ముద్దుబిడ్డ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆహ్వానం పలికారు. పిప్రి గ్రామ డెవలప్మెంట్ కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీసీసీ అధ్యక్షుడిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కుటుంబానికి లొద్ది రామన్న ఆలయంతో అనుబంధం ఉందని, అనుబంధం ఉన్న ఆలయ ఉత్సవాల్లో పాల్గొనాలని వీడీసీ సభ్యులు కోరారు. అందుకు స్పందించిన పీసీసీ అధ్యక్షులు తప్పకుండ హాజరుకావడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. పీసీసీని కలిసిన వారిలో పిప్రి వీడీసీ సభ్యులు గుర్జికింది లింబాద్రి, గొల్ల లింబన్న, లోక్కిడి అశోక్, ఆరిగేల జనార్దన్, పఠాని జేమ్స్, తదితరులు ఉన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు, పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించాలి

నుడా చైర్మన్ కేశవేణుకు సీపీఐ(ఎం) వినతి



నుడా చైర్మన్ కేశవేణుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు, పైప్ లైన్, వంటి సమస్యలను పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) స్థానిక రోటరీ నగర్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుడా చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ కేశవేణు కి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రోటరీ నగర్ శాఖ కార్యదర్శి నల్వాల నర్సయ్య మాట్లాడుతూ.. న్యాల్కల్ రోడ్డు రోటరీ నగర్ 7వ డివిజన్‌లో 15 సంవత్సరాలు నుండి 20 కుటుంబాలు నివసిస్తున్నాయని, కానీ ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయన అన్నారు. అదేవిధంగా కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరు రోడ్లపై చేరి రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతుందని, దోమలు, దుర్వాసనలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. చైర్మన్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్ది వెంకట్రములు, పార్టీ సభ్యులు సంపల్లి సతీష్ సాయిలు,బ్రహ్మం, చంద్రమౌళి,తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని రాజకీయాల్లోకి లాగకండి

● ఇటుక బట్టీల యజమానుల వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న ఇటుక బట్టీల యజమానులు

అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య ఎన్నో రాజకీయాలు, విమర్శలు, ఆరోపణలు ఉంటాయని, అయితే రాజకీయాల్లోకి తమను లాగ వద్దని ఇటుక బట్టీల యజమానులు కోరారు. సోమవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటుక బట్టీల యజమానులు మాట్లాడారు. తామంతా కుటుంబ పోషణలో భాగంగా ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకొని నిబంధనల మేరకు ఇటుక బట్టీలను నడుపుకుంటున్నామని తెలిపారు. ఇటుక బట్టీలపై ఆధారపడి ఇతర రాష్ట్రాల వలస కూలీలు వందలాది మంది బతుకుతున్నారని తెలిపారు. అలాగే అభివృద్ధిలో తమ భాగస్వామ్యం కూడా ఎంతో కొంత ఉందని గుర్తు చేశారు. వలస కూలీలకు ఆసరాగా నిలబడుతూ, రాజకీయాలకు అతీతంగా బతుకుతున్న తమను అనవసరంగా రాజకీయాల్లోకి కొన్ని పార్టీల నాయకులు లాగడం ఆవేదన కలిగిస్తుందన్నారు. ఇకమీదట రాజకీయాల్లోకి ఇటుక బట్టీలను లాగి ప్రభుత్వానికి లక్ష్యంగా మారేలా చేయవద్దని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇటుక బట్టీల యజమానులు ఎస్ మురళి, కే నారాయణ, ఏ అంజిబాబు, కే శ్రీనివాసరావు, కే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | మార్చి 18, 2025 | www.navatelangana.com

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలో నాగిరెడ్డిపేట్ మండల విద్యార్థినిలు తమ సత్తా చాటారు. యూనివర్సల్ 369 షోటోకన్ కరాటే అకాడమీ అసోసియేషన్ మేడ్చల్ సుమంగళి గార్డెన్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే పోటీలో నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు 17 మంది పాల్గొని స్పారింగ్ విభాగంలో 17 బంగారు పతకాలు, చాంపియన్ షిప్ ట్రోఫీ సాధించారు. కరాటే పోటీలో ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించిన విద్యార్థినీలకు పాఠశాల ప్రిన్సిపాల్ గీతా, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినులకు అభినందించారు. విద్యార్థినీల వెంట పిఈటి శోభ, కరాటే కోచ్ మంగలి యాదగిరి ఉన్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నాసిక్‌లో మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన వర్ని ఏఎంసీ చైర్మన్

నవతెలంగాణ-వర్ని

మహారాష్ట్రలోని నాసిక్ తాలూకాలో జరిగే వ్యవసాయ మార్కెట్ టీట్‌ను వర్ని మండల మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, వైస్ చైర్మన్ కొత్మికర్ లక్ష్మణ్, డైరెక్టర్లు సోమవారం సందర్శించారు. నాసిక్ మార్కెట్ యార్డ్ అధికారులతో రైతులు పండించే పంటలను, వాటిని మార్కెట్‌లో మద్దతు ధరతో అమ్ముకొనే వెసులుబాటును విధి విధానంపై అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల ద్వారా రైతులకు మేలు చేకూరే విధానం, కొత్త వ్యవసాయం గురించి వర్ని మార్కెట్ కమిటీ బృందం తెలుసుకున్నారు.


మార్కెట్ యార్డును సందర్శించిన దృశ్యం

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

- ఎస్ఈ శ్రావణ్ కుమార్
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలం బాట

నవతెలంగాణ-లింగంపేట్

ప్రతి రైతు తమ బోరుబావుల వద్ద మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని విద్యుత్ శాఖ ఎస్సీ శ్రావణ్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని నల్లమడుగు గ్రామంలో లింగంపేట్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విద్యుత్ లైన్‌లపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు అలాగే మోటర్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని, స్వతహగా రైతులు విద్యుత్ మరమ్మతులు చేయకూడదని ఆయన అన్నారు. విద్యుత్ మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో సమస్య ఏర్పడితే లైన్మెన్‌కు సమాచారం అందించాలన్నారు. సమస్యను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది సేఫ్టీ ప్రికాషన్స్ వాడి పనులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా రైతులు జాగ్రత్తలు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ విజయ సారథి, ఏడి మల్లేశం, ఏఈ హరీష్ రావు, విద్యుత్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


పొలంబాటలో విద్యుత్ అధికారులు, రైతులు

ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-ఎడపల్లి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు గ్రామపంచాయతీ మున్సిపాలిటీ మండల పరిషత్ జిల్లా పరిషత్‌లలో వికలాంగులకు నామినేట్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రతి మండల కేంద్రంలో గ్రామాలలో సంతకాల సేకరణ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. దీని మూలంగా వికలాంగులకు రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీలో 130 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ 540 ప్రతి చోటా ఒక మహిళకు, ఒక పురుషుడికి నామినేటెడ్ చేయాలన్నారు. ఇప్పటికీ రాజస్థాన్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, దీని మూలంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం ఏమీ కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో యురడి గోపాల్, కళ్లగడ్డ రాజు, ఉప్పు దేవదాస్, ఉప్పు సాయికుమార్, శ్రీనివాస్, ప్రశాంత్, రాహుల్, కళ్యాణి, బన్నీ దీక్ష, అక్షర, సంధ్య, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


సంతకాలను సేకరిస్తున్న ఎన్పీఆర్డీ నాయకులు

దొంగలు దొరికారు

నవతెలంగాణ-నిజాంసాగర్

మేదరి భూమవ్వ అనే మహిళ తన కూతురు ఇంటికి వెళ్లేందుకు శనివారం సాయంత్రం నిజాంసాగర్ బస్టాండ్ వద్ద అచ్చంపేట వెళ్లడానికి ఆటో కోసం ఎదురుచూస్తుండగా భూమవ్వను ఆటో డ్రైవర్, ఓ మహిళ ఇద్దరు కలిసి ఆటోలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బంగారం, వెండి వస్తువులను దోచుకున్న విషయం తెలిసిందే. ఆ దొంగలను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ కథనం ప్రకారం.. బొగ్గు గుడిసె ఎక్స్‌రోడ్డు నందు సోమవారం వెహికల్స్‌ను పరిశీలిస్తుండగా ఓ ఆటోలో పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకొని వారిని విచారించగా అందులో ఉన్న పోలో జాక్సన్ సుందర్ రాజ్, వడ్డే లక్ష్మి అనే ఇద్దర్ భూమవ్వను బాచేపల్లి శివారుకు తీసుకెళ్లి ఆమె దగ్గర నుంచి బలవంతంగా బంగారం పుస్తే, గుండ్లు, చెవి నాగులు, చేతి రెట్ట కడియాలు దొంగిలించామని వారు ఒప్పుకున్నారు. ఇద్దరు నేరస్తులను కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసు చేదనలో ప్రతిభ కనబరిచిన నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్, కానిస్టేబుల్ శ్యామ్, మహేష్‌ను బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ అభినందించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు ఓఆర్ఎస్ కార్నర్ ఏర్పాటు చేసినట్టు మెడికల్ అధికారులు యేమిమా, దివ్య తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ ద్రావణం ఎలా తయారు చేయాలో వివరించారు. ఒక లీటర్ నీటిలో ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్ కలిపి 24 గంటల్లో వాడాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావొద్దని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలపై ఏదైనా టోపీ, కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. నలుపు రంగులు దుస్తులు వాడవద్దని, బజార్‌లో దొరికే ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్స్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మంచినీటిని ఎక్కడపడితే అక్కడ తాగకుండా శుభ్రమైన నీటినే తాగాలని, వాంతులు విరోచనాలు అయిన వెంటనే సమీపంలోని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని అన్నారు. ఎక్కువ నిర్లక్ష్యం చేయకుండా తొందరగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, వైద్య సిబ్బంది సతీష్ తదితరులున్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సి జిల్లా అధ్యక్షులుగా సాయికృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య కామారెడ్డి జిల్లా కమిటీ అధ్యక్షులుగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక ఉద్యమకారులు వడ్ల సాయికృష్ణను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాముల నారాయణ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఇంజన్ సాంబశివరావులు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారత రాజ్యాంగ చట్టాలను అనుసరించి అవినీతి, అక్రమాలకు తావులేని సమాజం కోసం నిరంతరం కృషిచేస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌సి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా నియామకమైన వడ్ల సాయికృష్ణ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని నీతి నిజాయితీతో నిర్వహిస్తానని, తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కామారెడ్డి జిల్లా అధ్యక్షులుగా వడ్ల సాయికృష్ణ నియామకంతో జిల్లాలోని ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెంజల్ గ్రంథాలయ భవనాన్ని పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి సోమవారం పరిశీలించారు. 32 లక్షల 50 వేల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న గ్రంథాలయం పనులను వేగవంతం చేసి నెల రోజులలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వారికి కావలసిన పుస్తకాలను అందుబాటులో ఉంచడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన భవనాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట గ్రంథ పాలకుడు నరేష్‌రెడ్డి, సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి బాబాగౌడ్, జావిద్ ఉద్దీన్, లచ్చేవారు నితీన్, కంఠం గంగారం, సాయిలు, సయ్యద్ సల్మాన్, శివకుమార్, గైని సాయిలు, కురుమే సాయిలు, సంతోష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులు పనులు

నవతెలంగాణ-రెంజల్

చేతికి వచ్చిన పంటను కాపాడుకోవడానికి కాలువ మరమ్మతులు చేసుకోవాలని మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి రైతులకు సూచించడంతో నీటి పారుదల శాఖ ఏఈ భుజెందర్, రైతులు గంగా కృష్ణ, ఎంఎల్ రాజు, స్నేహిత్, మొగులజి పనులను ప్రారంభించారు. జగదాంబ రైస్‌మిల్లు నుంచి లిఫ్ట్ కాలువ వరకు ఈ కాలువ మరమ్మతులు చేయిస్తే సుమారు 200 ఎకరాల పంటకు నీరు అందించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటిని గంగాసాగర్ చెరువు వరకు తీసుకెళ్లినట్లయితే తన ఆయకట్టు కింద 2 ఎకరాలకు నీరు అందుతుందని వారు పేర్కొన్నారు. ఏ విధంగానైనా తమ పంటలు చేతికి వచ్చేలా రైతులు ముందుకు రావడం అభినందనీయమని సుదర్శన్ రెడ్డి అన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ రూ.25 లక్షల నిధులతో శాసనసభ్యులు మదన్ మోహన్ ఆదేశాల మేరకు బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ఎస్సి విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాలయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, మాజీ ఎంపిటిసి బీరయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆశ సురేష్, ఎస్సీ సెల్ మండల జనరల్ సెక్రటరీ జగ్గ బాలరాజ్, గ్రామ అధ్యక్షుడు చిందం రాజయ్య, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, జంగం ప్రభుస్వామి, పెసర సాయిలు, దేవదాస్, బాలాజీ, డాక్టర్ గణేష్, శ్రీహరి తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సభ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల వార్షికోత్సవాన్ని, వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. ముఖ్య అతిథిగా మండల నోడల్ అధికారి మల్లేశం మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ మార్కులు సాధించాలని ఆయన కోరారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగనాథ్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

19న సైలని బాబా ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 9న సైలని బాబా ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు వహీద్ బాబా పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం నీలా గ్రామం నుంచి శోభాయాత్ర నిర్వహించి సైలాన్ బాబా దర్గాకు గంధాలను తీసుకెళ్లి చాదర్‌తో ప్రత్యేక ప్రార్థనలను చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి భక్తులు విచ్చేసి తమ కోరికలను నెరవేర్చుకోవాలని ఆయన సూచించారు. సాయంత్రం 10 గంటలకు ఎంఎస్సీ ఫామ్ గ్రామానికి చెందిన వారితో కవ్వాలి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిని నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

నవతెలంగాణ-లింగంపేట్


ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సభాదృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గంలో చారిత్రక కట్టడాలు, పురాతన కట్టడాలు చాలా ఉన్నాయన్నారు. లింగంపేట్ మండలంలోని చారిత్రక పురాతనమైనటువంటి కట్టడమైన నాగన్నగారి మెట్ల బావి ఉందన్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేసి పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయం ముందు గాలికి ఊగే గజ స్తంభం, ఆసియాలో రెండవదిగా నిలిచిందని ఆయన అన్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ గ్రామంలో త్రిలింగేశ్వర ఆలయం మూడు లింగాలు ఒకే చోట ఉన్నాయన్నారు. మంజీరా నది లింగ ఆకారంలో ప్రవహిస్తుందని ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. తాడ్వాయి మండలంలో చిట్యాల గ్రామ సమీపంలో భీమేశ్వర ఆలయం ఎంతో ప్రాముఖ్యత కలిగిందన్నారు. రామారెడ్డి మండలంలోని కాలభైరవ స్వామి ఆలయం రోజువారి భక్తుల తాకిడి అధికంగా ఉన్నదని, మరెన్నో చారిత్రక కట్టడాలు ఆలయాలు ఉన్నాయని వివరించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం పర్యాట కేంద్రంగా మార్చాలని ఆయన సభా దృష్టికి తీసుకువచ్చారు. సభలో చారిత్రక కట్టడాల గురించి క్షుణ్ణంగా వివరించారు. దీంతో మంత్రులు స్పందించి చారిత్రక కట్టడాలు పూర్వం తీసుకురావడానికి ప్రభుత్వం ముందుందని తెలిపారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి డిఎస్పీగా సుంకరి శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి డిఎస్పీగా సుంకరి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎల్లారెడ్డి డీఎస్పీగా ఇదివరకు పని చేసిన శ్రీనివాసులు బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. ఆయన స్థానంలో నల్గొండ జిల్లాకు చెందిన సుంకరి శ్రీనివాసరావు బాధ్యతలను స్వీకరించారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైలు నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఎస్పిని శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందజేశారు.



మానసిక రుగ్మతలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

మానసిక రుగ్మతులపై విద్యార్థినీ విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల విశాల్ అవగాహన కల్పించారు. మండలంలోని దూపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయన ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చదువుల పట్ల ఏకాగ్రత, క్రమశిక్షణ, పోషకాహారాలు, సత్ప్రవర్తన, మానసిక రుగ్మతలపై ఆధారపడి ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వ్యసనాలు, దురాలవాట్లకు పాల్పడిన తల్లిదండ్రులకు సైతం పిల్లలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, పిఆర్‌టియు మండల అధ్యక్షులు టి.సోమలింగం గౌడ్, ఉపాధ్యాయులు కృష్ణ, రాజేశ్వర్, ప్రభాకర్, సాయన్న, రాములు, రాధా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-జుక్కల్

యూత్ ఫోరం ఆధ్వర్యంలో పెద్దఎడ్గి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూత్ ఫోరం సభ్యులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులు భయపడకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని యూత్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ తిరుపతయ్య హాజరయ్యారు. ఉపాధ్యాయులు జాదో హీరా, ఉపాధ్యాయుల బృందం, యూత్ సభ్యులు అస్పత్‌వార్ అరుణ్, మారుతి, విట్టల్, రవీందర్, సునీల్, శుభం పాల్గొన్నారు.

బాగేపల్లిలో కొనసాగుతున్న ఉపాధి పనులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు పంట కాలువలు, పంట పొలాలకు వెళ్లే రోడ్లు మరమ్మతుల పనులు చేపట్టినట్లు క్షేత్ర సహాయకులు గోపి పేర్కొన్నారు. వేసవిలో కూలీలకు పనులు కల్పించాలన్న తలంపుతో ఆ కాలువలు రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టామన్నారు. కొలతల ప్రకారం వారికి పని కల్పించి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆవుల యజమానులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో పంటపొలాలను ఆవులు ధ్వంసం చేస్తున్నాయని ఆవుల యజమానులపై చర్యలు తీసుకోవాలని సోమవారం రైతులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వెంకట్ గౌడ్, గురు ప్రసాద్, లక్ష్మణ్, సాయిలు, కాశరం బాలయ్య, బలరాం రాములుతో పాటు రైతులు ఉన్నారు.

ఎక్స్‌పోజర్ విజిట్‌లో గాంధారి విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ గాంధారి 10వ తరగతి విద్యార్థులు ఎక్స్పోజర్ విజిట్ ఫేజ్ 3లో భాగంగా టీర్యాల్ తెలంగాణ తిరుమల దేవస్థానం, రుద్రూర్ ఆహార సాంకేతిక, వ్యవసాయ కళాశాలను, బాసర సరస్వతి ఆలయాలు, అలీసాగర్, సారంగాపూర్ పాల శీతలీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఆహార ఉత్పత్తులు, పాల నాణ్యత, ప్రాసెసింగ్, ప్యాకింగ్‌ను తెలుసుకున్నారు. చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాలు సందర్శించడం వల్ల నిర్మాణ శైలి, శిల్పుల నైపుణ్యత, ఆనాటి చారిత్రక విషయాలు, శిలాశాసనాల ద్వారా తెలుసుకోవచ్చునని ప్రధానోపాధ్యాయులు శ్రీ రంగా వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు. విజ్ఞానాన్ని పెంపొందించే ఈ సందర్శనలో ఉపాధ్యాయ బృందం మల్లేష్, చిరంజీవి, వనజ, రాధాదేవి, చక్రధర్, శంకర్‌గౌడ్, జ్ఞానేశ్వర్, మార బాల్‌రెడ్డి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

నవతెలంగాణ-గాంధారి

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని షీటీమ్ బృందం తెలిపింది. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపిఎస్ ఆదేశాల మేరకు మండలంలోని చద్మల్ ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాబృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్, షీటీం, సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం, గాంధారి పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

5 లక్షలు పలికిన తైబజార్ వేలం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన తై బజార్ వేలంపాట ఐదు లక్షలు పలికింది. సర్కారు వారి పాట రూ.4,57,000 ఉండగా వేలం పాటలో ఐదుగురు పోటీపడి.. రూ.5 లక్షలకు నాగిరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కంచన్పల్లి సాయిగౌడ్, తైబజార్‌ను సొంతం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. గత సంవత్సరం రూ.3,14,000 పలుకగా ఈ సంవత్సరం 1,86,000 అధికంగా వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ తైబజార్ 2025 ఏప్రిల్ నుండి 2026 మార్చి 30 వరకు ఉంటుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. గతంలో 9 నెలలు మాత్రమే తైబజార్ వేలం నిర్వహించగా ప్రస్తుతం 12 నెలలకు గాను నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణజివాడి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం పరిశీలించినట్లు ప్రధానోపాధ్యాయురాలు మెగవత్ సంగుబాయి తెలిపారు. భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులు ప్లేట్లు శుభ్రంగా కడుక్కొని భోజనం చేయాలని, వంట ఏజెన్సీలు కూడా పరిశుభ్రత పాటిస్తూ వడ్డించాలని సూచించారు. భోజనం రుచికరంగా ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్ కలాన్ వీడీసీ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పోతంగల్ కలాన్ గ్రామ అభివృద్ధి నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్‌గా జె.మహిపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా సాబీర్, ప్రధాన కార్యదర్శిగా హన్మాండ్లు, కోశాధికారిగా గణేష్‌కుమార్, సంజీవ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని కులాల గ్రామ పెద్దలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-సదాశివనగర్

విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలని హెడ్మాస్టర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పద్మాజివాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఫలితాలు తేవాలని విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షులు ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు కృషి ఫలితంగా మద్నూర్ మండల కేంద్రంలో రూ.50 లక్షల నిధులు మంజూరు కావడంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని రథం గల్లి నుంచి దళితవాడ మీదుగా సోనాల చౌరస్తా మెయిన్ రోడ్డు వరకు, అలాగే కుంట కింద నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాల చుట్టూ నుంచి మెయిన్ రోడ్డు వరకు, గోశాల పక్కన గల దళిత శ్మశాన వాటికకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. అదేవిధంగా గాంధీ చౌక్ నుంచి గ్రామ చివరి ఎల్లమ్మ గల్లి వరకు నిర్మాణం పనులు చేపట్టడానికి ఎమ్మెల్యే కృషి ఫలితంగా మండల కేంద్రానికి 50 లక్షల నిధులు మంజూరు అవడంతో పనులు కొనసాగుతున్నాయి.

రామారెడ్డి తహసీల్దార్ బదిలీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సువర్ణ బాన్సువాడకు బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉమలతను రామారెడ్డి తహసీల్దార్‌గా నియమిస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

నిజామాబాద్ నుంచి సిద్ధిపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాదు నుండి కామారెడ్డి మీదుగా సిద్దిపేట వరకు నూతనంగా ఎలక్ట్రికల్ ఎక్స్ ప్రెస్ బస్సులను నిజామాబాద్ - 2 డిపో నుంచి నడుపుతున్నట్టు 2వ డిపో మేనేజర్ సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ నుండి ఉదయం 05.45, 06.30, 07.15, మధ్యాహ్నం 14.15, 15.15, 15.45 బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. సిద్దిపేట్ నుండి ఉదయం 09.30, 10.15, 11.00 తో పాటు సాయంత్రం 18.00, 19.00, 19.30 సమయంలో బస్సులు నడపబడును అని ప్రయాణీకులకు తెలిపారు. ఈ అవకాశము సద్వినియోగం చేసుకోని సురక్షిత సుఖవంతమైన ప్రయాణాన్ని పొందలని, ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పాలిటెక్నిక్ మైదానంలో ఎగ్జిబిషన్



భూమిపూజ నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా నిర్వహించనున్న ఎగ్జిబిషన్ కోసం భూమి పూజ కార్యక్రమం సోమవారం పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నిర్వహించే 42వ ఎగ్జిబిషన్‌కు సన్నాహంగా భూమి పూజ చేసినట్టు తెలిపారు. ఏప్రిల్ 20వ తేదీ నుండి ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని జూన్ మూడో తారీకు వరకు ఉంటుందని తెలిపారు. ఎగ్జిబిషన్లో సుమారు 300 షాపులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చిన్నపిల్లలకు అన్ని రకాల ఆటలు ఆడేందుకు తదితర స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కావున ఏప్రిల్ 20 తేదీ నుండి ప్రారంభమయ్యే ఎగ్జిబిషన్లో ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులంతా కలిసి కంఠేశ్వర్ లోని పాలిటెక్నిక్ మైదానంలో భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి నరసింహులు, దిగంబర్, లక్కం రెడ్డి, ఆనంద్ రావు, వినోద్ కుమార్, రామచంద్ర రెడ్డి, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామ వాస్తవ్యులు మారకంటి లింగం ఇటీవలే అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి స్పందించి వారు ఇచ్చిన ఆదేశాల తో వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ ఓ సీ ద్వారా రూ. 75,000 సోమవారం ఒడ్యాట్ పల్లి కాంగ్రెస్ గ్రామ నాయకులు టి. గంగాధర్ అందజేశారు. ఎల్ఓసీ ఇప్పించి వారి కుటుంబాన్ని ఆదుకొన్న ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డికి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ డిపోను సందర్శించిన కార్గో డిఎం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద టిఎస్ఆర్ టి సి లాజిస్టిక్స్‌ను డిపో మేనేజర్ రవికుమార్‌తో కలిసి నిజామాబాద్, ఆదిలాబాద్ కార్గో డీఎం పాల్ సోమవారం సందర్శించారు. అనంతరం భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణ తలంబ్రాలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. మీడియాతో మాట్లాడుతూ కేవలం 151 రూపాయలు చెల్లింపుతో భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం తలంబ్రాలు మీ ఇంటి వద్దకే చేర్చే అరుదైన అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఆర్టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భయం, బెదురు లేకుండా పరీక్షలు రాయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్
- పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా కార్యక్రమాలు
- నిర్వహించడం అభినందనీయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



త్వరలో జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్య బోధన తో పాటు ఇతర కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆంద్రయ్య, పాఠశాల ఉపాధ్యాయులను డిఇఓ అభినందించారు. గ్రామానికి చెందిన మహేందర్ దేవాల్ ఎంఐటిలో ప్రొఫెసర్ గా చేస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ అతను తన శిష్యుడేనని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు అవసరమైన సలహాలను సూచనలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 1949లో చదివిన ఇద్దరు విద్యార్థులను, 1955 లో పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన రాజన్నను డీఈవో చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. అనంతరం డిఈఓ ను పాఠశాల తరపున ఘనంగా సన్మా నించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి, స్థానిక సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కమల, విద్యార్థుల తల్లిదండ్రులు, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దులోఎస్పీ పర్యటన

నవతెలంగాణ-మద్నూర్/జుక్కల్



కామారెడ్డి జిల్లా ఎస్పీగా నూతనంగా వచ్చిన ఎం రాజేష్ చంద్ర సోమవారం తెలంగాణ రాష్ట్ర సరిహద్దును పరిశీలించారు. ముందుగా మద్నూర్ పోలీస్ స్టేషన్ సంద ర్శించి పోలీసులకు పలు సూచనలు ఇచ్చారు. రికా ర్డులు పరిశీలించారు.తెలంగాణ సరిహద్దు మహా రాష్ట్ర బోర్డర్ను సందర్శించి మన రాష్ట్ర సరిహద్దును పరిశీ లించారు. ఎస్పి వెంట డిఎస్పి, సిఐ, మద్నూర్ ఎస్సై స్థానిక ం గా లేకపోవడం ఏఎస్ఐ సుధాకర్ ఇతర పోలీసులు ఉన్నారు.

జుక్కల్ స్టేషన్ సందర్శన

జుక్కల్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు బాధితులతో మర్యాదగా మెలగాలని, వారితో మంచి ప్రవర్తనతో ఉండాలని అమర్యాదగా ప్రవర్తిం చరాదని సూచించారు. పంచాయతీలు పోలీస్ స్టేషన్‌లో పెట్టకుండా చూడాలని పోలీసులకు సూచించారు. అనంతరం జుక్కల్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఒక్కొక్కరిగా పరిచయం చేసుకొని విధులలో నిర్లక్ష్యంగా ఉండకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఎస్సై , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధనలతో..

- టీయూకు అంతర్జాతీయంగా గుర్తింపు తేవాలి
- వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాష్యుటికల్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన మిస్ వెన్నెల, కృష్ణ ప్రకాష్.. తైవాన్ లోని నేషనల్ డాంగువా యూనివర్సిటీలో పీహెచ్డీ ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో విద్యార్థులను అభినందించి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్డీ అడ్మిషన్ దక్కించుకోవడం తెలంగాణ యూనివర్సిటీ కి గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగంలో అద్భుతమైన పరిశోధనలు చేసి యూనివర్సిటీ కి గుర్తింపు తేవాలని సూచించారు.అంతర్జాతీయంగా ఈ అడ్మిషన్లు సాధించుటకు కృషి చేస్తున్న డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ మావురపు సత్యనారాయణ, డాక్టర్ శిరీష బోయపాటి లను వీ సి అభినందించి భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు అంతర్జాతీయంగా స్థిరపడే విధంగా సలహాలు సూచనలు అందించాలన్నారు.

పేదల భూములను ముట్టుకుంటే తగిన బుద్ధిచెప్తాం

- సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హుస్సేన్ నగర్ ప్రభుత్వం భూములను వెంటనే కబ్జాలో ఉన్న లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తు సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లిసిపిఐ(ఎం. ఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యులు ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. సిరికొండ మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామ పరిధిలోని సీలింగ్ ద్వారా వచ్చిన ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 836లో ఎస్సి, బిసి, మైనారిటీలకు చెందిన 70 మంది వ్యవసాయ కూలీలు సుమారుగా 130- 150 సాగుచేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని 15 సంవత్సరాల నుండి పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం. ఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేష్, డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, రావుట్ల. పుష్పలత, బరుకుంట. భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

గురు శ్రేష్ఠ పురస్కారమ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



గురు శ్రేష్ఠ పురస్కారామ్ అందుకున్న ప్రేమ్ లాల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కవి ప్రేమ్ లాల్ గురు శ్రేష్ఠ పురస్కారం అందు కున్నారు. పురస్కారాన్ని పోస్టులో రావు ఆర్గనైజషన్ వారు పంపించారని కన్వీనర్ అశోక్ రెడ్డి తెలి పారు. ఈ సందర్భంగా ప్రేమ్ లాల్ హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- ట్రాఫిక్ సిఐ ఓడి రమేష్

నవతెలంగాణ-ఆర్మూర్

ట్రాఫిక్ నబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ ఓడి రమేష్ అన్నారు. మున్సిపల్ పరిధి మామిడిపల్లి చౌరస్తా వద్ద సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాహనదారులు రద్దీగా ఉండే కొత్త బస్టాండు, మామిడిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తా వద్ద వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిం చడం లేదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్సై రఘుపతి, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్ రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపిడి రాజారెడ్డి వాళ్ళ మామ రాజారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బాధిత కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సేన ఆధ్వర్యంలో క్యాంపస్ టు కెరీర్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో క్యాంపస్ టు కెరీర్ సెమీనార్‌ను నిర్వహించినట్టు విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మీర్కర్ వినయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యంగ్ ఎంట్రీ ప్రీనీయర్ విస్ఫోర్ట్, ఏబిసి ఎడిటేక్ ఫౌండర్ అండ్ సీఈవో మిస్ దిల్మీత్ చాదా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ రమేష్ చైతన్య, ఇందర్ దీప్, కళాశాల అధ్యాపకులు జైప్రకాష్, శ్రీనివాస్ రెడ్డి, మీరా, కవిత, శ్రీలత విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌పై ఫీజు రాయితీ వినియోగించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీజు చెల్లింపు పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఈనెల 31 తేదీ లోపు ప్లాట్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించిన వారికి 25 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాదారులు ఆన్‌లైన్‌లో చెల్లించిన తర్వాత సంబంధిత పత్రాన్ని గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తిరుమల గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.